క్లుప్తంగా

కొనసాగుతున్న నిరసనలు



నినాదాలు చేస్తున్న మహిళలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డు ఏర్పాటుకు జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 117వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. నల్లవల్లి గ్రామంలోని దీక్షా శిబిరంలో స్థానిక మహిళలు పాల్గొని సంఘీభావం తెలిపారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు పనులు నిలిపే వరకు నిరసనలు విరమించమని స్పష్టం చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కాలిబూడిదైన పరిసరాలు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని బాన్సువాడలో డబుల్ పోల్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. దీంతో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గ్రామానికి సమీపంలో ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో ప్రయాణికులు , వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మంటలు చెలరేగడంతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మొక్కలు, గడ్డి కాలి బూడిదైంది. సంబంధిత విద్యుత్ శాఖాధికారులు ప్రతీ సీజన్‌లో లైన్లను పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న శ్రీనివాస్ దంపతులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాస్ భెల్ టౌన్‌షిప్‌లోని పెద్దమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మాజీ వార్డు సభ్యులు గిరి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఆలయం వద్ద పేదలకు దుప్పట్లు, పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో సీఎం రేవంత్ రెడ్డి ఈ బాధ్యతలను అప్పగించారని తెలిపారు. నిజాయితీగా తను ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగదీశ్వర్, నాయకులు పి.వి.భాస్కర్, బాక్సర్ గిరి, శేషగిరి రావు, ఫణీ , సునీల్, నిరంజన్‌లు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కంగ్టి(నారాయణఖేడ్): రైతులు చిరుధాన్యాలు సాగు చేసి.. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సేవానాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నాగుర్(కే), నాగుర్(బీ) గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తు తరాలకు చిరుధాన్యాల అవసరం చాలా ఉందని.. పోషకాల గనిగా వర్ణించారు. పొలాల్లో పచ్చిరొట్ట వేసి రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏఓ హరీశ్‌పవార్ తెలిపారు. సీజన్‌లకు అనుగుణంగా కూరగాయలు వేసి అధిక లాభాలు పొందాలని ఉద్యాన శాస్త్రవేత్త శైలజ వివరించారు. భూసార పరీక్షలు చేసి అవసరం మేరకు రసాయన ఎరువులు వాడాలని, లింగాకర్ష బుట్టలు, జిగురు ప్యాడ్‌లు వినియోగించి పురుగుల ఉధృతి తగ్గించాలని శాస్త్రవేత్తలు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సంతోష్‌కుమార్, హేమలత, శ్రీకాంత్, లక్ష్మన్, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

వెల్దుర్తి(తూప్రాన్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను వెల్దుర్తి పోలీసులు సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు తీసుకోకుండా రాత్రి సమయంలో హల్దీవాగు నుంచి ఇతర మండలాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు మండలంలోని ఆరెగూడెం గ్రామ శివారులో శనివారం రాత్రి రెండు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకున్నారు. స్థానిక అవసరాలకు కాకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిర్వహణ లేక ఆహ్లాదం ఆవిరి



నిర్వహణ లేని పట్టణ ప్రకృతి వనం

- పార్కుల్లో పచ్చదనం దెబ్బతిని, మూలనపడిన పరికరాలు
- పట్టించుకోని అధికారులు, సిబ్బంది
- కబ్జాకు గురవుతున్న పార్కులు

జిన్నారం(పటాన్‌చెరు): పచ్చదనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతుంటే అవేమీ పట్టనట్లుగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం నిధులు కేటాయించి.. పట్టణ ప్రగతిలో ఆరు పార్కులను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పార్కుల నిర్వహణ పరిస్థితి దయనీయంగా మారింది.

నిర్వహణ లోపం..

పట్టణ ప్రగతిలో ఏర్పాటు చేసిన పార్కులను అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి గురి చేశారు. హరితహారం పేరిట మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను విస్మరించారు. దీంతో పార్కుల్లో చెట్లు, పూల మొక్కలు పూర్తిగా సంరక్షణ లేక ఎండిపోసాగాయి. కనీసం అధికారులు పర్యవేక్షించకపోవడంతో పార్కుల దుస్థితి అస్తవ్యస్తంగా మారింది.

మూలనపడ్డ పరికరాలు

పలు పార్కుల్లో ప్రభుత్వం నిధులు వెచ్చించి పచ్చదనాన్ని పెంపొందించే పరికరాలను ఏర్పాటు చేసింది. అత్యధిక పార్కుల్లో పచ్చదనం దెబ్బతినగా.. పరికరాలు మూలనపడ్డాయి. కొన్ని పార్కుల్లో అసలు పరికరాలే ఏర్పాటు చేయకుండా వదిలేశారు. కనీసం పార్కులు ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం గమనార్హం. పారిశ్రామికవాడలో పార్కుల దుస్థితిపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలుష్యాన్ని తట్టుకునేందుకు పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిసినా సరే అధికారులు సిబ్బంది అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పార్కు స్థలాలు కబ్జాకు ప్రయత్నాలు

పట్టణ ప్రగతిలో ప్రజలకు ఉపయోగకరంగా ఉండేందుకు పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తే అందుకు విరుద్ధంగా పరిస్థితులు మారుతున్నాయి. సర్వే నంబర్ 36, 39లో పార్కుల నిర్వహణ లోపంతో అధికారులు సిబ్బంది అటువైపుగా కన్నెత్తి చూడడం లేదని పసిగట్టిన అక్రమార్కులు పార్క్ స్థలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటికే పార్కు కోసం కేటాయించిన స్థలాల్లో దర్జాగా రోడ్లను ఏర్పాటు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో భూముల రేట్లు కోట్లు పలుకుతున్నాయని గ్రహించిన అక్రమార్కులు పార్క్ స్థలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మేలుకొని పార్కులను అభివృద్ధి చేసి వాడుకలోకి తీసుకువస్తే ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ఆస్కారం ఉంటుందని ప్రజలు వాపోతున్నారు.

పచ్చదనం పెంపొందించాలి

అర్బన్ పార్కుల్లో పచ్చదనంతో పాటు చిన్న పిల్లల కోసం పరికరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తే బాగుంటుంది. ఇంతకుముందు ఏర్పాటు చేసిన పార్కుల్లో సరైన నిర్వహణ లేదు. దీంతో పచ్చదనం పూర్తిగా దెబ్బతింది. పట్టింపు లేకపోవడంతో పార్కుల్లోకి వెళ్లేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. అధికారులు ఆహ్లాదకరంగా మార్చే చర్యలకు పూనుకోవాలి.

– అమీర్ , స్థానికుడు బొల్లారం

కబ్జా చేస్తున్నా పట్టించుకోరా?

ప్రభుత్వ స్థలాల్లో పార్కులను ఏర్పాటు చేసినా వాటి నిర్వహణ బాధ్యత అధికారులు విస్మరించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో భూములు కోట్లు పలుకుతున్నాయని గ్రహించిన అక్రమార్కులు పార్కు స్థలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. కబ్జాకు గురవుతున్న అధికారులు పట్టించుకోరా? ఇలా విలువైన ప్రభుత్వ భూములను కోల్పోకుండా చర్యలు చేపట్టాలి.

– తిరుపతిరెడ్డి , బొల్లారం

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తాం



మున్సిపాలిటీలోని పార్కుల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అన్ని పార్కులను పరిశీలించాం. స్పెషల్ ఆఫీసర్‌తో చర్చించి నిధులు కేటాయిస్తాం. తద్వారా పార్కుల నిర్వహణకు టెండర్లు పిలుస్తాం. పార్కుల అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. మున్సిపాలిటీలోని ప్రధాన చౌరస్తాలో జంక్షన్‌లు ఏర్పాటు చేసేందుకు ప్లాన్ రెడీ చేస్తున్నాం.

– మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, బొల్లారం

సీఐటీయూతోనే మెరుగైన వేతన ఒప్పందం

రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కారాములు

జహీరాబాద్ టౌన్: మెరుగైన వేతన ఒప్పందం సీఐటీయూతోనే సాధ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. జహీరాబాద్ మహీంద్ర అండ్ మహీంద్ర పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఆయన మాట్లాడారు. మహీంద్ర కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎన్నోసార్లు చారిత్రాత్మకమైన వేతన ఒప్పందం చేయించిన ఘనత సీఐటీయూదేనన్నారు. వేతనంతో పాటు అనేక బెనిఫిట్స్ సాధించామన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులకు కనీసం కార్మిక చట్టాలపై అవగాహన లేదన్నారు. ఈ నెల 5న జరగబోయే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూను గెలిపిస్తే మరోమారు మెరుగైన వేతన ఒప్పందం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, నాయకులు రాంచందర్, మహిపాల్, రాజిరెడ్డి, కనకారెడ్డి, నారాయణ, నరేష్ కార్మికులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



ఇళ్ల పనులను ప్రారంభిస్తున్న నిర్మలారెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెల్టూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఆదివారం టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి శంకుస్థాపన చేసి ముగ్గుపోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. నాలుగు విడతల్లో రూ.5లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. నిరుపేదల సంక్షేమానికి, అభివృద్ధి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, హౌసింగ్ ఏఈ రేష్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శివకుమార్, యూసుఫ్, శైలేందర్ రెడ్డి, ఆత్మకూరు శేఖర్ పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మర్వెల్లి కేజీబీవీ పాఠశాలలో పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ గోవింద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అటెండర్-1, డే వాచ్‌మెన్-1, నైట్ వాచ్‌మెన్-1, హెడ్‌కుక్-1, అసిస్టెంట్ కుక్-2, స్వీపర్‌కమ్ స్కావెంజర్-1 మొత్తం 7 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు ఆయన తెలిపారు. అటెండర్, డే వాచ్‌మెన్, నైట్ వాచ్‌మెన్, హెడ్‌కుక్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు 10 ఉత్తీర్ణత, అసిస్టెంట్ కుక్, స్వీపర్ పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తులు చేసుకునేందుకు 18 సంవత్సరాల పైబడిన మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. ఈనెల 12న అందోల్ కేజీబీవీ పాఠశాలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు. అభ్యర్థుల ఎంపిక జిల్లా విద్యాశాఖ నిబంధనల ప్రకారం మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది..

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్

నారాయణఖేడ్: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు, ఖేడ్ మండలం పోతన్‌పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెహ్రూనాయక్ పదవీ విరమణను పురస్కరించుకుని ఆదివారం ఖేడ్‌లో అభినందన సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. అంకితభావంతో పనిచేస్తూ వృత్తికి న్యాయం చేసేవారిని వారి శిష్యులు, ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, బీజేపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు అమర్‌సింగ్, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా, స్థానిక బాధ్యులు. ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొని నెహ్రూనాయక్, శారద దంపతులను గజమాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్



క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న రవీందర్ గౌడ్

జిన్నారం (పటాన్‌చెరు): క్రీడతో మానసికోల్లాసం కలుగుతుందని జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ అన్నారు మండలంలోని శివానగర్‌కు చెందిన నిర్మాల సత్యనారాయణ ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత మద్యం, ఇతర వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. నేటి యువతలో నూతన ఉత్సాహం నింపేందుకు టోర్నమెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు సత్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రభుత్వ పథకాలతో ప్రయోజనం



నారాయణఖేడ్: సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖేడ్‌లోని తన నివాసంలో మనూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన బందెల్లి రజాక్‌కు రూ.60 వేలు, ఎన్‌జీ.హుక్రానకు చెందిన జహీరాబీకి రూ.36 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. పేదల ఆరోగ్యానికి ప్రభు త్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో దిలీప్‌రెడ్డి, అఖిలేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.



హత్నూర: బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

హత్నూర (సంగారెడ్డి): పేదల ఆస్పత్రి ఖర్చులకు సీఎంఆర్‌ఎఫ్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం హత్నూర మండలం సికింద్లాపూర్ గ్రామానికి చెందిన బి.మానసకి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 17,500 చెక్కును ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాయిని వీరేందర్, కిష్టారెడ్డి, వెంకటేశం, వీర ప్రసాద్, అనిల్, శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఆర్ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా గణేష్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల ఎన్‌ఎంఆర్ యువసేన సోషల్ మీడియా ఇన్‌చార్జిగా మంగంపేట గ్రామానికి చెందిన పంబల గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీలం మధు చేస్తున్న సేవా కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా విస్తరించేలా కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నీలం మధుకు, కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

యథేచ్ఛగా చెట్లు నరికివేత



నరికివేసిన చెట్లు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం ఊట్ల గ్రామాల మధ్య ప్రధాన రహదారికి ఇరువైపులా హరితహారంగా నాటిన చెట్లు నరికివేతకు గురవుతున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు ముందస్తు ప్రణాళిక లేకుండా విద్యుత్ లైన్‌లకు చెట్టు కొమ్మలు అడ్డుగా ఉన్నాయని నరికివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి మొక్కలు నాటి సంరక్షిస్తుంటే ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సాయం అందజేత

మునిపల్లి(అందోల్): ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన కనకయ్య పక్షవాతానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ కూతురు త్రిష రాజనర్సింహ ఫౌండేషన్ ద్వారా సాయం చేసేందుకు ముందుకు వచ్చింది. రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి కనకయ్యకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు రసూల్‌పటేల్, రాజు, మాజీ ఎంపీటీసీలు పాండు, మనోహర్, నాయకులు పాల్గొన్నారు.

పాడైన హైమాస్ట్ లైట్లు

అవస్థలు పడుతున్న ప్రయాణికులు



వెలుగని హైమాస్ట్ లైట్లు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ముంగి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లు పాడైయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు పాడై ఏళ్ల గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏడేళ్ల క్రితం ఎంపీ కోటలో రూ.2 లక్షలు వెచ్చించి చౌరస్తా వద్ద హైమాస్టు లైట్లను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో నాలుగు నెలలు మాత్రమే వెలిగిన లైట్లు అనంతరం పాడైపోయాయి. లైట్లు పాడై సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటే భయాందోళన చెందుతున్నారు. లైట్ల ఏర్పాటులో నాసిరకం పరికరాలను వాడడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని పాడైపోయిన హైమాస్ట్ లైట్లను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా అపూర్వ సమ్మేళనం



వట్‌పల్లి(అందోల్): ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు



సదాశివపేట: ప్రభుత్వ రవీంద్రమోడల్ ఉన్నత పాఠశాలలో..



హత్నూర(సంగారెడ్డి): సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధి నేరడిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2007-08లో పదవతరగతి చదువుకున్న అప్పటి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 5 ఏళ్ల తర్వాత అందరూ ఒకే వేదిక పైకి వచ్చి ఒకరినొకరు ఆప్యాయంగా పాలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని సంతోషంగా గడిపారు. 80 మంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. చదువులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

ఆత్మీయ సమ్మేళనం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని గవర్నమెంట్ రవీంద్రమోడల్ ఉన్నత పాఠశాల పదవ తరగతి 2004–2005 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 సంవత్సరాల తరువాత కలుసుకని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగితెలుసుకుని సంతోషంగా గడిపారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ

దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2000-2001 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు.

కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పృథ్వీరాజ్, విశాల్, ప్రసాద్‌గౌడ్, గౌస్, రాంమోహన్, ప్రభాకర్, నరేష్, శ్రీకాంత్, వీర వెంకటేష్, సాయి, రవినాయక్, సాయిబాబాగౌడ్, శ్యామ్యూల్, రాకేష్, నిరంజన్, అంజి, మహేశ్, మొహియుద్దిన్, రహమత్ పాల్గొన్నారు.

మైదానం కాదు.. గుర్రపుడెక్క



పిచ్చిమొక్కలతో మైదానాన్ని తలపిస్తున్న చెరువు. ఇన్‌సెట్‌లో నీళ్లు తాగటానికి దిగి పైకి రావటానికి ఇబ్బందులు పడుతున్న గేదెలు

సంగారెడ్డి కల్వకుంట శివారులోని చెరువంతా గుర్రపు డెక్క విస్తరించి కళావిహీనంగా మారింది. పిచ్చిమొక్కలు వ్యాపించి మైదానాన్ని తలపిస్తోంది. చెరువు పరిసరాలు దుర్గంధం వ్యాపించి వాకింగ్ కోసం వెళ్తున్న వారి ముక్కు పుటలు అదిరిపోతున్నాయి. పశువులు సైతం నీళ్ల తాగటానికి దిగి పైకి వచ్చే క్రమంలో నీళ్ల లోతు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి